విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

ఆదివారం 10, నవంబరు - 2024 8 పేజీలు

పోలీసులు రౌడీల్లా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు

వర్రా అరెస్టు యల్లోమీడియా ద్వారానే వెల్లడి
బిటెక్ రవి ఆరోపణలు అవాస్తవం
తప్పుడు కేసులు బనాయిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
కడప ఎంపీ అవినాష్‌రెడ్డి హెచ్చరిక

విశాలాంధ్ర-పులివెందుల: పోలీసులు చట్టాన్ని అతిక్రమించి రౌడీల్లా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేదిలేదని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హెచ్చరించారు. సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి అరెస్టు చేసిన విషయం యల్లో మీడియా ద్వారానే వెల్లడైంది. కానీ వర్రా అరెస్టు వ్యవహారంలో టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ వర్రా రవీంద్రారెడ్డి తమకు సోదరుడితో సమానమన్నారు. శుక్రవారం రాత్రి అర్ధరాత్రి పోలీస్ అధికారులు రవీంద్రారెడ్డి ఇంటికి వెళ్లి లాఠీలతో తలుపులు కొడుతూ భయభ్రాంతులకు గురిచేయడం శోచనీయమన్నారు. ప్రతి రోజు రవీంద్రారెడ్డి పోలీసులకు అందుబాటులోనే ఉంటారన్నారు. వివిధ సమస్యలపై పోలీస్ అధికారులతో చర్చిస్తుంటారని తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై దాడులకు దిగి లాఠీలతో తలుపులను బద్దలు కొట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థలో కరెక్టేనా అని ప్రశ్నించారు. టిడిపి అధిష్టాం ఆదేశాలను పాటిస్తున్న పోలీసుల వైఖరిని తాము ఖండిస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో వందల సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తల అరెస్టులు ఉంటాయన్న సమాచారం తమకు తెలుస్తోందన్నారు. ఇదే జరిగితే పోలీస్ అధికారులకు తగిన శాస్తి చేస్తామని ఆయన మరోమారు హెచ్చరించారు. వర్రా రవీంద్రారెడ్డి విషయంలో టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి అసంబద్ధ వ్యాఖ్య లను మాధ్యమిక ప్రసారాలల్లో తప్పుడు కథనాలు వినిపించారన్నారు. కానీ శుక్రవారం సాయంత్రం కర్నూలు- మహబూబ్‌నగర్ సరిహద్దు ప్రాంతంలో వర్రాను అరెస్టు చేసిన విషయాన్ని ఏబీఎన్, ఈనాడు, టివి-5 చానళ్లు ప్రసారం చేశాయన్నారు. వాటి కథనాలను అవినాష్‌రెడ్డి మీడియాకు చూపించారు. వర్రాకు ఏదైనా జరిగితే అది వైసీపీదే బాధ్యతట ఈ వాస్తవ విషయాలు గమనించకుండా టిటెక్ రవి ఎక్కడో కూర్చుని అవాస్తవాలు వెల్లడించడం దారుణమన్నారు. నిజంగా ఏదైనా అవార్డు వస్తే ఇంత పచ్చి అపద్దాలు మాట్లాడిన బిటెక్ రవికే ఇవ్వాలని ఎద్దేవాచేశారు. కానీ యల్లో మీడియాలో వచ్చిన వార్తలు వినకుండా వాస్త వాలు తెలుసుకోకుండా ఇంత అజ్ఞానంతో మాట్లాడటం బిటెక్ రవి అవివేకానికి నిదర్శనమన్నారు. ఇప్పటికీ వర్రాపై పోలీసులు థర్డ్ డిగ్రీ మెథడు ఫాలోవుతున్నారన్నారు. అదుపులోకి తీసుకున్న రవీంద్రారెడ్డిని వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాగే తప్పుడు కేసులు బనాయించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలియజేశారు. పోలీసులు చట్టపరిధిలో వ్యవహరిస్తే మంచిదని, వీధి రౌడీల్లా వ్యవహరిస్తే సహించే ప్రసక్తేలేదని హెచ్చరించారు.

ప్రమాణానికి సిద్ధమా.! రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధమా.!!

విశాలాంధ్ర-కడపకార్పొరేషన్ : ప్రమాణానికి సిద్ధమా రాజకీయ సన్యాసానికి సిద్ధమా అంటూ నగర మేయర్ సురేష్ బాబు, శనివారం కడప నగరంలోని దేవుని కడపలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ భాష, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి మేయర్ రూ. 3 కోట్లు తీసుకొని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి రెడ్డి గెలుపునకు సహకరించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఆరోపణలకు సమాధానంగా దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో దేవుడు ముందు ప్రమాణం చేశామని తెలిపారు. ఎంతో నమ్మకంతో వైఎస్ఆర్సిపి పార్టీలో కొనసాగుతున్న వారిపై ఇటు వంటి దుష్ప్రచారం చేయడం తగదన్నారు. వైసిపి పార్టీకి జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి అభిమానిగా ఉంటానన్నారు. దమ్ముంటే దేవుని వద్దకు వచ్చి తెలుగుదేశం పార్టీ

2

2

మదనపల్లెలో సిఐడి, ఏసీబి అధికారుల సోదాలు

సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దహనం కేసులో దూకుడు పెంచిన అధికారులు

విశాలాంధ్ర-మదనపల్లె : మదనపల్లె సబ్ కలెక్టరేట్లో ఫైళ్ల దహనం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న పూర్వపు ఆర్డీవో మురళికి చెందిన నివాసాలలో శనివారం సిఐడి అధికారులు తనిఖీలు చేశారు. మదనపల్లి పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లోని మురళి నివాసంతో పాటు, తిరుపతిలో ఆయన కుమారుడు నివసిస్తున్న ఇంటిలో కూడా సిఐడి అధికారులు తనిఖీలు చేసి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లెలో సిఐడి సిఐ హేమంత్ కుమార్ రెడ్డి బృందం పలు డాక్యుమెంట్లతో పాటు హార్డ్ డిస్క్‌లను తనిఖీలు చేశారు. ఆర్డీఓ మురళికి అనుకూలస్తుడుగా ఉన్న విఆర్ఓ శేఖర్ ఆదాయానికి మించి ఆస్థులు కలిగి ఉన్నాడన్న ఆరోపణలతో ఆయన ఇంటిలో ఏసీబీ సీఐ మోహన్ ప్రసాద్ బృందం సోదాలు చేశారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ఫ్రీ హోల్డ్ భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించడంలో ఆర్డీఓ మురళి కీలక పాత్ర పోషించారనే అభియోగాలు

2

ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని పరిశీలించాలి

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి : జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

విశాలాంధ్ర-గాలివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని పరిశీలించాలని,నిర్దేశిత కాలం లోపు సమస్యలకు పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. శనివారం గాలి వీడు మండలానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఆర్జీల వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్,వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమ అనంతరం జాయింట్ కలెక్టర్ మండల అధికారులతో రెవెన్యూశాఖ సిబ్బందితో పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలలో ఇంకా కొన్ని పరిష్కారం కాలేదని,అర్జీల పరిష్కారానికి అధికారులకు సమయం ఇవ్వడం జరుగుతుందని,నిర్దేశిత కాల సమయంలోపు పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఎంక్వయిరీ,సర్వే, క్షేత్ర స్థాయిలో

2

జగన్ అసెంబ్లీకి వెళ్లాలి లేదా రాజీనామా చేయాలి :తులసి రెడ్డి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ :పులివెందుల శాసన సభ్యుడు జగన్, ఆ పార్టీ శాసన సభ్యులు ఈ నెల 11వ తేదీ నుంచి జరగబోవు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకూడదని, బహిష్కరించాలని నిర్ణయించడం శోచనీయం, దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికారప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి అన్నారు. శనివారం కడపలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ చర్య ప్రజాస్వామ్య దేవాలయం అయిన అసెంబ్లీని అవమాన పరచడమే అవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలకు, పులివెందుల తదితర అసెంబ్లీల ప్రజలకు అన్యాయం, మోసం చేయడం అవుతుందన్నారు. సూపర్ 6 హామీల అమలు, ఉచిత ఇసుక, బెల్టు షాపులు, శాంతి భద్రతలు, డయేరియా వంటి సమస్యలు ఉన్నాయి. వీటి మీద అసెంబ్లీలో చర్చించకుండా పారిపోవడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వని కారణంగా హాజరు కావడం లేదని చెప్పడం హాస్యాస్పదం. తాటిచెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డికోసం అన్నట్లుంది. ప్రతిపక్ష నాయకునీ హోదా ఇవ్వాలంటే అసెంబ్లీ మొత్తం సభ్యుల్లో 10 శాతం శాసన సభ్యులు వుండాలి.అంటే 18 మంది ఉండాలి.కానీ వైకాపాకు 11 మందే ఉన్నారు. 2014లో, 2019లో లోక్‌సభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా దక్కలేదు. జగన్‌కు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు రెండే మార్గాలు. ఒకటి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం, లేదా రాజీనామా చేయడం తేల్చుకోవాలని తులసి రెడ్డి సవాల్ విసిరారు. ఈ విలేకరుల సమావేశంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, మాజీ పిసిసి ఉపాధ్యక్షులు బండి జకరయ్య, మాజీ పీసీసీ కార్యదర్శి అబ్దుల్ సత్తార్, శ్యామలమ్మ, సిరాజుద్దీన్, మైనుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, సంజయ్ కాంత, మహబూబ్ బాషా, శీలం గంగయ్య పాల్గొన్నారు.

రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధమా.!!

(మొదటి పేజీ తరువాయి)

పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి దేవుడి వద్ద ప్రమాణం చేయాలని వారు డిమాండ్ చేశారు. 35 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఉంటూ ఒకే కుటుంబంలో కొనసాగుతూ ప్రజాసేవ చేస్తున్నటువంటి సురేష్ బాబుపై నిందారోపణలు చేయడం వారికి తగదున్నారు. నిందారోపణలు వేసిన శ్రీనివాసులు రెడ్డి మాట మార్చి నేను ఆయనను అనలేదు ఒక పెద్ద మనిషి అని చెప్పానే తప్ప గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తరుముకున్నట్టు ఆయన అనుకున్నారని మీడియాతో మాట్లాడటం తప్పు అన్నారు. మా సురేష్ బాబు ఏ రోజు స్వలాభం కోసం పనిచేయలేదని పార్టీ అధిష్ఠానం మేరకే పని చేశామని తెలిపారు. డబ్బులు తీసుకోలేదని మేము ప్రమాణం చేశాము మీరు కూడా దేవుని వద్ద ప్రమాణం చేసి నిరూపించుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర రెడ్డి, పులి సునీల్ కుమార్, బసవరాజు, మాస్టర్ అహ్మద్, దాసరి శివ, కే బాబు, త్యాగరాజు, రెండవ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి, బండి ప్రసాద్, లక్ష్మయ్య, గౌస్ బాషా (చాక్లెట్)వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని పరిశీలించాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలన చేయాలని,అవసరం అయితే ఉన్నతాధికారికి బదలాయించడం చేయాలన్నారు.పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన ప్రతీ అర్జీని ఆడిట్ చేస్తామన్నారు. అర్జీదారులలో కొంత మందికి నేరుగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారంపై ప్రజా స్పందన తెలుసుకుంటామన్నారు.గ్రామ సచివాలయాలలో సిబ్బంది హాజరును ఎంపీడీఓలు పర్యవేక్షించాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలతో వచ్చే ప్రతి అర్జీదారుని సమస్యను సావధానంగా విని పరిష్కరించడానికి వీలుపడే వాటికి సత్వర పరిష్కారం చూపాలని,పరిష్కరించబడని సమస్యలకు సంబంధించి వివరాలను అర్జీదారునికి పూర్తిగా తెలియజేయా లన్నారు. అర్జీల రీ ఓపెన్ కు తావు లేకుండా న్యాయమైన పరిష్కారం చూపాలన్నారు. రీసర్వే, ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్,మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జేసీ...

మండలంలోని గోరాన్ చెరువు గ్రామం కుమ్మరపల్లి నివాసి అయిన అనిమెల భాస్కర్ ఇచ్చిన్న పిర్యాదు మేరకు శనివారం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ స్వయంగా తహసీల్దార్ భాగ్యలత, రెవెన్యూ శాఖ సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్వే నెంబర్ 1963లో 15 ఎకరాలు 12 సెంట్ల డీకేటి భూమి వున్నదని అందులో ఎంత మందికి పట్టాలు వున్నాయి నిర్ధారించి సర్వే చేసి మిగిలిన ప్రభుత్వ భూమిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు.అర్జీదారుడి సమస్యను త్వరిత గతిన పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, వీఆర్వోలు, సర్వేయర్లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో సిఐడి, ఏసీబి అధికారుల సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికిఅనుచరుడుగా వ్యవహరించిన ఆర్డీవో మురళి హయాంలోనే, ఫోర్జరీ సంతకా లతో వైసీపీ ప్రధాన నాయకులు పేదల నుంచి బలవంతంగా కొనుగోలు చేసిన భూములను ఫ్రీ హోల్డ్ జాబితాలో ఎక్కించడంలో ఆర్డీవో మురళి కీలక పాత్ర పోషించారని అనుమా నాలతో ఇటీవల ఆయన సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. జూలై 21వ తేదీన మదనపల్లి సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ఫైళ్ల దహనం ఘటనను టిడిపి కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అప్పట్లో రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు, అప్పటి సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యాన్నార్ ప్రత్యేక హెలికాప్టర్లో మదనపల్లికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే. ఆ తరువాత సిఐడి అధికారులు రెండు నెలల పాటు కేసు దర్యాప్తు చేపట్టి 8 మందిపై కేసులు నమోదు చేశారు. పూర్వపు ఆర్డీఓ మురళితో పాటు మరో ఆర్డీఓ హరిప్రసాద్, కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజను సస్పెండ్ చేశారు. చాలా రోజుల వ్యవధి తరువాత గత మూడు రోజుల క్రితం సిఐడి అధికారులు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని జల్లెడ పట్టి, పలు రికార్డులను పరిశీలించారు. శనివారం మరోమారు సిఐడి, ఏసిబి అధికారులు సోదాలు చేయడంతో సబ్ కలెక్టేట్ ఫైళ్ల దహనం కేసు హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఏ క్షణంలో ఎవరింటిని ఏసిబి, సిఐడి చుట్టు ముడుతారోనని అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

కడప బాలోత్సవం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : 2024 నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవం పురస్కరించుకొని కడప బాలోత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు భాష నైపుణ్యాలను పెంపొందించడానికి నేటి సమాజంలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులలో అవగాహన కల్పించడానికి పద్య పఠన వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు కడప బాలోత్సవ కమిటీ అధ్యక్షులు జి. గోపాల్ తెలియజేశారు. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు కడపలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల నందు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ 6,7,8 తరగతుల విద్యార్థులకు 'ట్రాఫిక్ సమస్యలు - పరిష్కారాలు అనే అంశంపై వ్యాసరచన పోటీ వేమన, సుమతీ శతకాలలోని పద్యాలాపన నిర్వహించామని అన్నారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు జూనియర్ విభాగం నుండి వ్యాస రచనకి 180 మంది పద్యాలాపన 225 మంది పాల్గొన్నారు మధ్యాహ్నం 9 10 తరగతుల సీనియర్ విద్యార్థులకు మత్తు పదార్థాలు- యువతపై ప్రభావం- వాటి నివారణ అంశంపై వ్యాసరచన పోటీ అలాగే నాటక రంగ పద్యాలు పై పోటీలు విడివిడిగా నిర్వహించడం జరిగింది. బాలోత్సవం ఉపాధ్యక్షులు ఉండేల నాగ ముని రెడ్డి బాల ఎల్లారెడ్డి మాట్లాడుతూ వ్యాసరచన పద్యాలాపన పోటీలలో ఇంత మంది విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందని వీరిని భాగస్వామ్యం చేసిన పాఠశాల యాజమాన్యాలకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని గురించి వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా విద్యా- విజ్ఞానం- నైపుణ్యం అనే అంశాలను ప్రధానం చేసుకొని కడప బాలోత్సవం పేరుతో ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతుందన్నారు.ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన వైవియు అధ్యాపక బృందానికి, రచయితలకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు లక్ష్మీరాజా, షామీర్,సుందరయ్య, వెంకటసుబ్బయ్య, దేవదత్త, వెంకటేశ్వర్లు,డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరరావు ,డాక్టర్ పొదిలి నాగరాజు, డాక్టర్ రెడ్డి శేఖర్, డాక్టర్ స్వతంత్ర బాబు, భూమి రెడ్డి స్వరూప రాణి,మోపూరి భైరవేశ్వర్, తన కంటి సందీప్, బండి పరిమళ జ్యోతి,రామచంద్రయ్యలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు జన విజ్ఞాన వేదిక నాయకులు శివరాం, సునీత, అరుణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్యం షాపులు కళ కళ.. బార్లు వెలవెల.!

విశాలాంధ్ర-రాయచోటి: రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలులోకి రావడంతో బ్రాందీ షాపుల వ్యాపారం కళకళలాడు తుండగా... బార్ అండ్ రెస్టారెంట్లకు వ్యాపారం లేక వెలవెల పోతు న్నాయి. వైసీపీ ప్రభుత్వంలో బ్రాందీ షాపుల్లో బ్రాండెడ్ మద్యమం లభించేది.అతి తక్కువగా ఉండేది అప్పట్లో ధరలు ఎక్కువైనా బ్రాండెడ్ మద్యం తాగాలనుకున్న మద్యం ప్రియులు బార్ అండ్ రెస్టారెంట్లను ఆశ్రయించేవాళ్లు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి ప్రైవేట్ మద్యం షాపులలో అన్ని రకాల మద్యమం బ్రాండ్లను అమలులోకి తెచ్చాయి. దీంతో మద్యం కొనుగోలుదారులు బార్ల వైపు చూడడం మానేశారు. గతంలో బార్లలో క్వార్టర్ మద్యం బాటిల్‌పై గరిష్టంగా రూ.100, ఫుల్ బాటిల్‌పై గరిష్టంగా రూ.500 అదనంగా అమ్మేవారు. ఇప్పుడు ప్రైవేట్ మద్యం షాపులలో ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే మద్యం లభిస్తుంది. వాస్తవంగా ప్రవేట్ షాపులకు ఎమ్మార్పీ కంటే 10.5 శాతం తక్కువ ధరకు మద్యం వస్తుంది. ఎమ్మార్పీ ధరలు ఉల్లంఘించి అమ్మితే జరిమానా షాప్ లైసెన్స్ రద్దు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో ప్రైవేట్ మద్యం షాపులలో ఎంఆర్‌పికే మద్యం ప్రస్తుతం అమ్ముతున్నారు. బార్ల విషయానికొస్తే ఎంఆర్‌పి ప్రభుత్వం నుంచి మద్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఎంఆర్‌పి ధరకు కొనుగోలు చేసి తమకు నచ్చిన రీతిలో ఆయా బార్లు సామర్థ్యాన్ని బట్టి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చు మొన్నటి వరకు ఇలా అధిక ధరలు అమ్మి బార్లు బాగా దండుకున్నాయి. అయితే ఊహించని రీతిలో ఇప్పుడు ప్రైవేట్ మద్యం షాపులలో అన్ని రకాల బ్రాండ్ల మద్యం చల్లటి బీరు ఎమ్మార్పీకే లభిస్తుండడంతో బార్ల దానికి గండి పడింది అన్నమయ్య జిల్లాలో ఉన్న బార్లకు మద్యం నూతన పాలసీతో ఆదాయంలో గొంతులో ఎలక్కాయ పడ్డది. ఈ ధరలను గమనిస్తే మద్యం షాపుల నుంచి కొన్ని రకాల బ్రాండెడ్ బీర్లు అడ్డదారిలో వెళ్తున్నాయని అనుమానాలు మద్యపాన ప్రియులు వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది జులై నెలాఖరు వరకు బారులకు లైసెన్సులు ఉన్నాయి. అప్పటివరకు అమ్మకాలు ఎలా పెంచుకోవాలని బారుల యజమానులు మల్లా గుల్లాలు పడుతున్నారు. బారులకు నూతన మద్యం పాలసీలో ఎంఆర్‌పి కంటే తక్కువ ధరలకు ఇవ్వాలని పలుభారుల యజమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

జియోట్యాగింగ్ నవీకరణ.!

కుటుంబ సభ్యుల వివరాలూ నమోదు..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని మ్యాపింగ్ (జియోట్యాగింగ్) చేయాలని ఆదేశించింది. వైకాపా హయాంలో సంక్షేమ పథకాల అమలుకు గ్రామాలు, పట్టణాల్లో ప్రతి ఇంటిని వాలంటీర్లతో మ్యాపింగ్ చేయించారు. పలు చోట్ల వాలంటీర్లు ఒక ఇంటిని రెండు మూడు దిశల్లో ఫోటోలు తీసి నమోదు చేయడంతో కుటుంబాల సంఖ్య పెరిగింది. గతంలో మ్యాపింగ్ చేసిన సమయంలో అద్దె ఇళ్లలో ఉన్న వారు ఈ రెండు మూడేళ్ల కాలంలో మరోచోటకు మారే అవకాశం లేకపోలేదు. మరికొందరు ఉపాధి విద్య గ్రామాంతరాలు వెళ్లి ఉండే అవకాశాలు లేకపోలేదు.దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కుటుంబాల వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు జియోట్యాగింగ్ నవీకరణకు ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఈ జియోట్యాగింగ్ నవీకరణ ప్రక్రియ చేపట్టారు. సచివాలయాల ఉద్యోగులు తమ పరిధిలోని ప్రతి కుటుంబానికి వెళ్లి ఆయా ఇళ్లను ఫోటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇదే సమయంలో ఆయా కుటుంబాల వివరాలు తెలుసుకొని వాటిని ధృవీకరించేలా కుటుంబ సభ్యుల్లో ఒకరితో ప్రత్యేక సాధనాలతో బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు తీసుకుంటున్నారు. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 645 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా వీటిల్లో ప్రస్తుతం 5657 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. పంచాయతీలు, పురపాలికలు, నగరపాలికల్లో 6,58,378 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ఆయా ఆవాసప్రాంతాల్లో జియో ట్యాగింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు సచివాలయాల ఉద్యోగులు చెబుతున్నారు.



బిజెపిని బలోపేతం చేయండి -జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో సంస్థాగతంగా భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల సాయిశుభ కళ్యాణ మండపంలో బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి లోకేష్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకు బలోపేతం అవుతోందన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్థాయి నుండి సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు.బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక రాయలసీమ ప్రాంత వాసిగా ఉంటూ అసెంబ్లీకి వెళ్ళను అని చెప్పడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందంటూ వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి బ్రహ్మం, జిల్లా ఇన్‌చార్జి చంద్రమౌళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు, ఎన్నికల సహాయ అధికారి పులి నరేందర్ రెడ్డి, ఎన్నికల సహా రిటర్నింగ్ అధికారి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గజపతిరాజు, రాయచోటి ఇన్‌చార్జి, కో కన్వీనర్ నిర్మల్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస కుమార్‌రాజు, బిజెపి నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల చేయూతకే సభ్యత్వ నమోదు : పార్థసారధి

విశాలాంధ్ర-గాలివీడు: టిడిపి కార్యకర్తలు ప్రమాద బారిన పడిన కుటుంబాలకు చేయూత నివ్వడానికే సభ్యత్వ నమోదు కార్యక్రమని సర్పంచ్ పార్థ సారథి రెడ్డి పేర్కొన్నారు.శనివారం పూలుకుంట బోరెడ్డిగారి పల్లి పంచాయితీలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేయించుకున్న వారికి అనేక ప్రయోజనాలు కలవన్నారు. ప్రధానంగా ప్రమాదంలో మృతి చెందితే రూ. 5 లక్షలు గాయపడ్డవారికి రూ.2 లక్షలు కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా అందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సులోచనమ్మ, బూత్ స్థాయి ఎజెంట్ నాగేశ్వర రావు,యువగళం సభ్యుడు సాయి ప్రసాద్ రెడ్డి,బూత్ కన్వీనర్లు శివ శంకర్ సుదర్శన్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు గోపాలయ్య,ఎఫ్ పి షాప్ డీలర్ టోపీవలి సాబ్, సింగల్ విండో మాజీ డైరెక్టర్ కొండారెడ్డి, టిడిపి నాయకులు రామాంజులు రెడ్డి, వెంకటేష్,రెడ్డయ్య పాల్గొన్నారు.

మృతి చెందిన భర్త వాటా ఆస్తిని నకిలీ వీలునామాతో కాజేస్తున్న రిటైర్డ్ జడ్జి

బావ రిటైర్డ్ జడ్జి సుబ్బారెడ్డి బారి నుండి రక్షణ కల్పించాలి :ఊటుకూరు లక్ష్మీదేవి వేడుకోలు

విశాలాంధ్ర-కడప రూరల్ : చట్ట ప్రకారం మామ ఊటుకురు కొండారెడ్డి నుండి వారసత్వ సగభాగం ఆస్తిని రెండవ కుమారుడైన, తమ భర్త పాల కొండారెడ్డి కుటుంబమైన మాకు చెందకుండా దుర్బుద్ధితో బావ అయిన సస్పెండ్ అయిన రిటైర్డ్ జడ్జి నకిలీ వీలునామా సృష్టించి మమ్మల్ని చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మా కుటుంబానికి న్యాయం చేయాలని ఊటుకూరు కృష్ణవేణి కోరారు. శనివారం మృత్యుంజయ కుంటలోని ఏపీ మహిళా సమాఖ్య కార్యాలయంలో సంఘ నగర కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి, చిన్న కుమార్తె శివ హర్షితతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కడప నగరంలో చిలకలబావి వీధిలో ఇద్దరు కుమార్తెలతో కలిసి జీవిస్తున్న మమ్మల్ని మా ఇంటి నుండి ఖాళీ చేయించేందుకు నా భర్త పాల కొండారెడ్డి చనిపోయిన 2018 నుండి బావ రిటైర్డ్ జడ్జి సుబ్బారెడ్డి మమ్మల్ని నానా ఇబ్బందులు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. చిలకల బావి వద్ద మూడు ఇల్లులు, తొమ్మిది కమర్షియల్ రూములు మా మామ కొండారెడ్డి ఆస్తిగా ఉన్నాయన్నారు.వాటన్నింటినీ దొంగ వీలునామగా సృష్టించుకుని మాకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. బాడుగులకు ఇచ్చిన కమర్షియల్ రూముల డబ్బులు అన్నీ కూడా సుబ్బారెడ్డినే కాజేస్తున్నాడన్నారు. పెళ్లికి ముందు తన భర్త ఆరోగ్యంగా ఉన్నాడని విషయాన్ని దాచి మా బావ సుబ్బారెడ్డి, ఆడబిడ్డ లక్ష్మీదేవిలు మైదుకూరులో మా ఇంటి వద్దకు వచ్చి మా తల్లిదండ్రులతో మాకు ఆస్తులు ఉన్నాయని చెప్పి పాల కొండారెడ్డితో 2004లో పెళ్లి చేశారన్నారు. మాకు ఇద్దరు ఆడపిల్లలు వున్నారని, 2018లో మా భర్త మృతి చెందిన తర్వాత బావ సుబ్బారెడ్డి తన లీగల్ క్రిమినల్ ఆలోచనలతో సర్వం ఆస్తి కాజేయాలని కోర్టులో కేసులు వేశారని తెలిపారు. మాకు తోడుగా ఉన్న మా తండ్రిపై కూడా ఊటుకూరు సుబ్బారెడ్డి కోర్టులో కేసు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విధాల అన్యాయానికి గురై ఆడపిల్లలతో కలసి జీవిస్తున్న మా కుటుంబానికి ఊటుకూరు సుబ్బారెడ్డి బారి నుండి పోలీసులు మాకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినమైన చర్యలు : తహసిల్దార్ వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - సంబేపల్లి : మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని తహసిల్దార్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్ర పరిధిలోని ప్రభుత్వ భూ ఆక్రమణల ఫిర్యాదులపై పరిశీలించి, విచారించి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రోహిబిషన్ బిల్లుకు ఆమోదం తెలిపారన్నారు ఈ బిల్లు భూకబ్జా దారుల్లో గుండెల్లో రైళ్ళు పరిగెత్తే విధంగా ఉందన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారికి 14 సంవత్సరాల జైలు శిక్షతో పాటు పెనాల్టీ వేయడం జరుగుతుందన్నారు,ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీఆర్వో లు పర్యవేక్షణలో ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. మోటకట్ల గ్రామ పరిధిలో రాయచోటి - తిరుపతి జాతీయ రహదారి ప్రక్కనే సర్వే నంబర్ 467 లోని 47 సెంట్లు ప్రభుత్వ చుక్కల బూమిని కొందరు కబ్జదారులు కాజేయడానికి ప్రయత్నం చేయగా సంబేపల్లి మండల పర్యటనలో జిల్లా కలెక్టర్ గారికి గ్రామస్థులు విజ్ఞప్తి చేయడంతో వెంటనే స్పందించి చర్యలకు ఆదేశించారు అందులో సూచిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు,పట్టా భూములు సమస్యలను కూడా మా పరిధిలో పరిశీలించి విచారించి రైతుల సమస్యలను కూడా పరిష్కరిస్తమన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

నేడు సుచరిత నర్సింగ్ హోంలో ఉచిత వైద్య శిబిరం :డా:నవాజ్యోత్ రెడ్డి

విశాలాంధ్ర - ముద్దనూరు : సుచరిత నర్సింగ్ హోం నందు నేడు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని ఒక ప్రకటనలో డా. నావాజ్యోత్ రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డా.యం. రమేష్, కీళ్ళ మార్పిడి స్పెషలిస్ట్, అలాగే ప్రొద్దుటూరు చెందిన డా. యం. నాగయ్య ప్రముఖ జనరల్ మెడిసిన్,క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, బి.పి, షుగర్, థైరాయిడ్,ఆయాసం,గుండెజబ్బులు,ఊపిరితిత్తులు, జ్వరం, పాయిజిన్ స్పెషలిస్ట్ వారిచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని కావున ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని స్వదినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రాథమికఆరోగ్య కేంద్రంలో అన్నదానం :ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-వీరబల్లి : వీరబల్లె మండలం వీరబల్లె గ్రామపంచాయతీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల లాగే ఈనెల కూడా అన్నదాన కార్యక్రమం వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి నిర్వహించారు. పీఎం ఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 9వ తేదీ 10వ తేదీ ప్రత్యేక నిపుణులైన డాక్టర్లచే వైద్యపరీక్షల నిమిత్తం హాస్పటల్‌కు అన్ని గ్రామాల నుంచి వచ్చు గర్భిణీ మహిళలకు మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించడం శుభ సంతోషకరం. గత మూడు సంవత్సరాల నుండి మండల వ్యాప్తంగా ఉన్న గర్భిణీ మహిళలకు పరీక్షలు నిమిత్తం వచ్చు ప్రతి గర్భిణీ మహిళకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డికి వీరబల్లె వైద్యాధికారిణి డాక్టర్ మనీషా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరబల్లె వైద్యాధికారిణి డాక్టర్ మనీషా సిహెచ్వో సుధాకర్ సూపర్వైజర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామాల వైద్య సిబ్బంది, గర్భిణీ మహిళలు, సహాయకులు పాల్గొన్నారు.

35 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర- నందలూరు: ప్రధానమంత్రి మాతా సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 35 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహిం చినట్లు ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ విశ్వనాథ్ తెలిపారు.ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ గర్భవతులకు బిపి ,రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. 29 మంది గర్భవతులను గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ స్కానింగ్ నిర్వహించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా రాయల్ సేవా సమితి అధ్యక్షులు గంగనపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పేషెంట్స్ కొరకు 300 ఓపి బుక్కులు వైద్యాధికారులకు అందజేశారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు ఆశా కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటనారాయణ, సూపర్వైజర్ సునీల్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పి లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష..ఆరోగ్యరక్ష... మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర- రాయచోటి: అయ్యప్ప దీక్ష ఆరోగ్యరక్ష అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం సుద్దలవాండ్లపల్లె రోడ్డులోని అయ్యప్ప గుడి (మణికంఠగిరి)లో శనివారం శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఎంబి టైల్స్ ఓనర్ లోకేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ స్వాములకు జరిగిన అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి స్వామి, ట్రెజరర్ మల్లన్న స్వామి, మండల బిసి నాయకులు పల్లపు రమేష్, జానం రవీంద్ర యాదవ్, బిసిసెల్ విజయ భాస్కర్, సుగవాసి శ్యామ్, కొత్తిమీర ప్రసాద్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సోషల్ మీడియా వారిపై పెడుతున్న అక్రమ కేసులు, అరెస్టులు ఆపాలి

విశాలాంధ్ర-రాయచోటి: ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం వైఎస్ జగన్మో హన్ రెడ్డి కుటుంబ సభ్యులపై, వైఎస్ విజయమ్మ, వైసిపి లోని మహిళలపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడు తున్న వారిని అరెస్టు చేయాలని రాజంపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు అమర్నాథరెడ్డి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, మదనపల్లి వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్‌లు ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో ఎస్పీ కార్యాలయంలో ఉన్న డీఎస్పీ కృష్ణ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కి వైసీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అధికారులు ప్రజాస్వామ్యబద్ధకంగా న్యాయం ధర్మం కాపాడాలని ప్రభుత్వాలు శాశ్వతం కాదని పక్ష సాధింపు చర్యలు విడనాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ కౌన్సిలర్లు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

సంఘాలు సెర్ఫ్ యాప్‌లో నమోదు చేసుకోవాలి - ఏపిఎం

విశాలాంధ్ర-రామాపురం: మండలంలోని స్వయం సహాయక సభ్యులకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెర్ఫ్ యాప్ తప్పక నమోదు చేయాలని రామాపురం స్వయం సహాయక సంఘం ఏపీఎం దేవసేన అన్నారు. శనివారం మండల కేంద్రమైన రామాపురం లోని స్వయం సహాయక కార్యాలయంలో సీసీలు గ్రామాలకు చెందిన ఆనిమేటర్ల సమావేశంలో పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వయం సహాయక గ్రూపులకు సంబంధించిన లబ్ధిదారులు ఒక్కొక్క సంఘంలో పదిమంది సభ్యులు ఉంటారని ఆ సభ్యులకు సంబంధించిన వివరాలు స్థానిక వివోఏలు ప్రతి సంఘ సభ్యురాల వద్దకు పోయి ప్రస్తుతం వచ్చిన యాప్‌లో వారి కుటుంబ వివరాలు తలసరి ఆదాయం పిల్లల వివరాలు గ్యాస్ కనెక్షన్ల వివరాలు ఆదాయ వివరాలు తప్పక పొందుపరచాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు ఆదినారాయణ. నాగరాజు. నరసింహులు. గంగాధర. రెడ్డి బాబు. తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన వైద్యఆరోగ్య శాఖాధికారి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టేకూరుపేటకు జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవిబాబు తనిఖీ చేశారు. ప్రతి నెల 9వ తారీఖున జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంనకు వచ్చి గర్భిణీ స్త్రీలకు పోషక ఆహారం గురించి తగు జాగ్రత్త లు వ్యక్తిగత పరిశుభ్రత, ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సేవలు గురించి అవగాహన కల్పించారు.తదుపరి కాన్పుల గది, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయరాం, సీహెచ్ఓ నిర్మల,ఆరోగ్య అధికారులు సాధు వెంకటేశ్వర్లు, సరస్వతి, నాగమ్మ, ఏఎన్ఎంలు హాజరయ్యారు.

మాదిగల ఆత్మీయ సదస్సుకు తరలిరండి

విశాలాంధ్ర-వేంపల్లి: ఈ నెల 17వ తేదీ ఆదివారం కడప రాజేశ్వరి కల్యాణ మండపం నందు నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సదస్సుకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోళ్ల భాస్కర్, కొమ్ము నాగేశ్వరరావు, గురునాథంలు కోరారు. ఆ మేరకు వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లి దళితవాడలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. డప్పు కళాకారులందరూ భారీ జన సమీకరణతో తరలిరావాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంగ రాజుమాదిగ, వేంపల్లి పుల్లయ్య, సాకే చరణ్‌కుమార్, ఓబులేసు, సేగటశీను తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోలో ప్రయాణం

విశాలాంధ్ర-సిద్దవటం : ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తరలిస్తూ ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. మండల పరిధిలోని లింగంపల్లి, మాచుపల్లి,కడపాయపల్లె, దేగలవాండ్లపల్లె,తదితర గ్రామాల నుండి ప్రజలు నిత్యం కడపకు వెళుతుంటారు. ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను తరలించడంపై గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రయాణికులు ముగ్గురితోపాటు డ్రైవర్ ఉండాలి. కానీ ఒక్క ఆటో వాల ఆటోలో దాదాపు 10 నుండి 12 వరకు ప్రయాణికులను తరలిస్తు న్నారు. అధికారులు తనిఖీలు లేకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా నడుస్తుంది.ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కొన్ని కుటుంబాలు రోడ్డున పడుతాయి. ఇప్పటికైనా సంబంధిత రవాణా అధికారులు తనిఖీలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరుతో నకిలీ సమావేశాలపై ఫిర్యాదు

విశాలాంధ్ర-కడప : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కడప జిల్లా కార్యాలయంలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి వి. రఘురాం నాయుడు, కడప జిల్లా అసోసియేట్ అధ్యక్ష కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, సుదర్శన్ రెడ్డి, కడప నగర అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ ప్రసాద్, నాగరాజు ఇతర జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, ఈనెల 10.11.2024 తేదీ నగరంలోని డి.పి.ఆర్ సి. భవనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరుతో జరుగుతున్న సర్వసభ్య సమావేశానికి ఎటువంటి అధికారికత లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి వారికి ఎటువంటి సంబంధం లేదని, రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలిసి 2022 సంవత్సరం జూన్ నెలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షులు కే. ఆర్. సూర్యనారాయణ నాయకత్వమే ప్రభుత్వంచే గుర్తించబడిన ఏకైక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి నిజమైన సంఘమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బ్యానర్ పైన ఆదివారం ఏర్పాటు కాబోతున్న సమావేశానికి ఎటువంటి గుర్తింపు లేదని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆస్కార్ రావును రాష్ట్ర కార్యవర్గంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న శ్రీకాంత్ రాజులను గత రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమోదం, తీర్మానం మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి తొలగించారన్నారు. వారికి వారి అనుయాయులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ఎటువంటి సంబంధం లేదని తెలియజేశారు. 2024 సంవత్సరంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వం కల్పించిన ఓ.డి. సౌకర్యం, ఆస్కార్ రావును సంఘం నుండి తొలగించిన కారణంగా ప్రస్తుతం ఓ.డి. సౌకర్యం తీసేసారాన్న విషయం వారికి ఎందుకు గుర్తు లేదని ప్రశ్నించారు. ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగులను గందరగోళానికి గురి చేయడం ఆస్కార్ రావు, వారి అనుయాయులకు మంచిది కాదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరుతో జరుగుతున్న నకిలీ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ఎటువంటి సంబంధం లేదు. ఈ విధంగా నకిలీ సమావేశం ఏర్పాటు పై ఆస్కార్ రావు, శ్రీకాంత్ రాజులపై మా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ పోలీస్ కేసు ఫైల్ చేసి యున్నారన్నారు. కావున ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ ఉద్యోగులు గమనించాలని కోరారు.

రేకుల షెడ్లను తొలగించండి :ఆర్ అండ్ బీ డిఈ వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-గాలివీడు:నాలుగురోడ్ల కూడలిలో ఆర్ అండ్ బీ స్థలంలో అక్రమంగా ఉన్న రేకుల షెడ్లను రెండు రోజుల్లో ఆక్రమణదారులు తొలగించాలని లేనిచో రెవెన్యూ,పోలీసులు,ఆర్ అండ్ బీ అధికారులు కలసి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు.శనివారం గాలివీడులోని నాలుగురోడ్ల కూడలిలో అక్రమనకు గురైన స్థలాన్ని స్థానిక పోలీసులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 2266 లోని 1.80 సెంట్లు భూమి ఉందని కూడలికి పోను మిగిలన స్థలాన్ని ఆర్ అండ్ బీ కి ఆదాయం చేకూర్చే విధంగా కాంప్లెక్స్ ను నిర్మిస్తామన్నారు. ఈ ఆక్రమణపై కలెక్టర్ ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరించి సత్వర చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : క్యాన్సర్ పై ప్రజలకు అవగాహన అవసరమని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతి కళ పేర్కొన్నారు.శనివారం జమ్మలమడుగు పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కన్నెల్లూరులో యూనివర్సల్ క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.శాంతి కళ మాట్లాడుతూ క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యమనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జబ్బు రాకముందే జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ నెల 14 నుండి ఇంటింటికి వెళ్లి ఈ పరీక్షలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్.తాహిరా, ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి ఆశ్రయం

విశాలాంధ్ర-పోరుమామిళ్ళ రూరల్ : ఊరు పేరు తెలీదు, భాషా రాదు, ఎండకు, వానకు రోడ్డు మీదే దీన స్థితిలో ఉన్న ఒక అనాథ వృద్ధురాలిని శనివారం వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి ఆదుకుని తమ సేవాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. వృద్ధురాలిని అక్కున చేర్చుకోవడం పట్ల స్థానికులు రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ అనాథలు కనిపించినా, ఆదరణ కరువై తమ పని తాము చేసుకోలేకపోయిన వారికి సైతం తమకు 8897292237 ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే అభాగ్యులకు ఆశ్రయం కల్పించి కొత్త జీవితం ఇస్తామని పేర్కొన్నారు. దాతల సాయంతో ఆశ్రమంలో అన్ని వసతులతో ఉచిత సేవ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పల్లెటూళ్లలో మూడు.. పట్టణాలల్లో రెండు సెంట్ల స్థలాలను కేటాయించాలి

ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలి

ఈ నెల 18న ఆందోళనలకు సిద్దం: సీపీఐ

విశాలాంధ్ర-వేంపల్లి: పేదల నివాస యోగ్యం కోసం పల్లెటూళ్లలో మూడు, అలాగే పట్టణాలల్లో రెండు సెంట్ల చొప్పున స్థలాలను కేటాయించాలని, అదే విధంగా ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, సీపీఐ పులివెందుల ప్రాంతీయ కార్యదర్శి వెంకటరాములు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఈ నెల 18వ తేదీన గ్రామ సచివాలయాల వద్ద ఆందోళనా కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు వారు హెచ్చరించారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి శనివారం వారు వేంపల్లెలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని ఆ ఇళ్ల స్థలాలు గ్రామాలకు పట్టణాలకు సుదూరంగా నివాస యోగ్యానికి అనుకూలంగా లేకపోవడంతో చాలామంది ఇప్పటికి వాటిల్లో చేరలేదన్నారు. కొన్నిచోట్ల పూర్తి కాలేదని మరికొన్ని చోట్ల అసలు మొదలే పెట్టలేదని తెలియజేశారు.ఇంటి నిర్మాణానికి ఇచ్చే 1,80,000 పెరిగిన రేట్లలో ఏమాత్రం సరిపోలేదని అందువలన గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామన్నా హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఇసుక ఇటుక సిమెంటు కంకర ఇనుము ధరలు పెరిగిన రిత్య గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.18వ తేదీన అన్ని అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా నాయకులు చాంద్ భాష, సిపిఐ వేంపల్లి మండల కార్యదర్శి అంజనప్ప ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర-పులివెందుల: అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది అకడమిక్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రటరీ మురళీ కృష్ణ సూచించారు. విధి నిర్వహణ కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం రాత్రి బెస్తవారిపల్లె అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బస చేశారు. ఈ సందర్భంగా ఉదయం పాఠశాల వసతి సముదాయా లను తనీఖీ చేశారు. అక్కడ శుభ్రత, భద్రత తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో అకడమిక్ ఫలితాలపై విశ్లేషించారు.గత ఫలితాలు పునరావృతం కాకుండా మెరుగైన ఫలితాలు సాధించేందుకు చొరవ చూపాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్జినోవ్స్ టెక్నాలజీస్‌తో మిట్స్ అనుబంధ ఒప్పందం

విశాలాంధ్ర-మదనపల్లె:మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగం వారు ఇండస్ట్రీ ఇన్స్టి ట్యూట్ ఇంటరాక్షన్ సెల్ ఆధ్వర్యంలో చెన్నైలోని గ్జినోవ్స్ టెక్నాలజీస్‌తో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథం తెలిపారు. ఆ కంపెనీ ప్రతినిధులు అబ్దుల్ రెహమాన్, బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్, బాలాజీ సంపత్, సీనియర్ ప్రాజెక్ట్ లీడ్, మణిగంధాన్, బిజినెస్ అనలిస్ట్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథంలు అనుబంధ ఒప్పందాల ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేశారు. అందులో చిన్న చిన్న ప్రాజెక్ట్స్ తో విద్యార్థులకు ఈ నూతన టెక్నాలజీస్ పై అవగాహనా పెంచేందుకు ఈ అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగాధిపతి డాక్టర్ ఎస్ పద్మ, కో ఆర్డినేటర్స్ డాక్టర్ ఈ సంధ్య, శాయిూజ్ అహమద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో మేడా

విశాలాంధ్ర-సిద్దవటం : రాజంపేట నియోజకవర్గం సిద్దవటం మండలం ఎస్.రాజంపేట బీసీ కాలనీ నందు రాష్ట్ర అధికార ప్రతినిధి మేడ విజయ్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వాలు జోరందుకున్నాయి. ఈ సభ్యుత్వాలు మాజీ సర్పంచ్ పార్ల రమణ యాదవ్ ఓబీనేని శ్రీనివాసులు యాదవ్ వెంకటేష్, రేవూరి సూర్య చందు,ఎన్టీఆర్ కాలనీ వినోద్ మని,అనిల్ పాల్గొన్న టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేక ముక్కలైన సిమెంట్ రోడ్డు..!

విశాలాంధ్ర-జమ్మలమడుగు: జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా ఉన్న సిమెంటు రోడ్డు నాణ్యత లేకపోవడంతో ముక్కలుగా చీలిపోయింది. అధికారులతో కుమ్మక్కై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా అ రోడ్డు నిర్మాణం పనులు చేశారు. రోడ్డు వేసిన కొన్ని రోజులకే ముక్కలుగా చెల్లిపోయింది. రోడ్డు వేసే సమయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు నాణ్యత లేకుండా రోడ్డును వేశారు. మున్సిపల్ కార్యాలయము ఎదురుగానే ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. ఈ రోడ్డు నుండి శేషారెడ్డి పల్లె, రోటరీ నగర్, రైల్వే స్టేషన్ కు ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు నుండి ద్విచక్ర వాహనదారులు స్కూటర్ను నడపాలంటే చాలా ఇబ్బం దులకు గురవుతున్నారు. కొన్ని సమయాలలో ద్విచక్ర వాహనం జారిపడి ప్రమా దాలకు గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఆ ప్రాంతంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతు న్నారు. విష సర్పాలు సైతం ముక్కలైన సిమెంటు రోడ్డులో ఉంటున్నాయని పలు వురు చెబుతున్నారు. ఉదయం, సాయంకాలం వేళల్లో పాదచారులు వాకింగ్ కు ఈ రోడ్డు నుండి వెళ్తుంటారు. పాదచారుల సైతం చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవలే ఒక వ్యక్తి ప్రమాదానికి గురై కాలు విరిగి ఫ్రాక్చర్ కావడం జరిగింది. మరో ఘటనలో యువకునికి గాయాలయి లివర్ దెబ్బతినిందని వైద్యులు తెలిపారు. కనీసం ఇప్పటికైనా జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డును మరమ్మత్తులు నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే నాణ్యతతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మించి వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

రాత్రి సమయంలో వాహనదారులు ఇబ్బందులు గురవుతున్నారు. (మహబూబ్ బాష - జమ్మలమడుగు).

మున్సిపాలిటీ ఎదురుగా ఉన్న రోడ్డులో రాత్రి సమయాలలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. చీకటిగా ఉండడంతో వాహనదారులకు అర్థం కావడం లేదు. నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాలు సైతం ఈ రోడ్డులో వెళ్తున్నాయి.

నాణ్యమైన రోడ్డును నిర్మించాలి:

(ప్రసాద్. సిపిఐ నాయకులు- జమ్మలమడుగు)

అధికారుల పర్యవేక్షణలో నాణ్యమైన రోడ్డును నిర్మించాలి. ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

లింగమూర్తికి శ్రద్ధాంజలి ఘటించిన తులసి రెడ్డి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కమ్యునిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, రైతు నాయకుడు లింగమూర్తి శుక్రవారం స్వర్గస్తులైనారు. లింగమూర్తి భౌతిక కాయానికి శనివారం కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, అఫ్జల్ ఖాన్, జకరయ్య, సత్తార్, మెయినుద్దీన్, ఉత్తన్న, వినయ్, నాగరాజు, మహబూబ్ భాషా తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

బీసీల సంక్షేమం నారా చంద్రబాబుతో సాధ్యం

యాదవ్ కమ్యూనిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్

విశాలాంధ్ర- సిద్ధవటం : బీసీల సంక్షేమ అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సాధ్యమని నామినేటెడ్ పదవుల్లో సముచిత న్యాయం జరిగిందని యాదవ్ కమ్యూనిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్ తెలియజేశారు. మండల కేంద్రమైన సిద్ధవటం లో శనివారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో ఒకే సామాజిక వర్గానికి పదవులు కట్టబెట్టారని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టుగా నరసింహ యాదవ్ కు కల్పించడం హర్షించదగ్గ విషయమని రాష్ట్ర ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలుగు సూర్యుడు సిపి బ్రౌన్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర-రాజంపేట: వేల పద్యాలను రచించి ప్రజల మన్ననలందుకొని ప్రజాకవిగా కీర్తి గడించిన యోగి వేమనను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనుడు చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ అని తెలుగు భాషా సంరక్షణ సమితి నాయకులు కొనియాడారు. తెలుగు సూర్యుడుగా వెలిగిన సిపి బ్రౌన్ మహాశయుని 226వ జయంతి నేపథ్యంలో స్థానిక జవులీ బజారులోని సరస్వతీ విద్యా మందిరంలో తెలుగు భాషా సంరక్షణ సమితి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, రాజంపేట మండల శాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, ఉపాధ్యక్షులు బివి నారాయణరాజు, తెలుగు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ మహానుభావులు తాము జీవించిన కాలంలో పదిమందికీ మేలు చేసే ఎన్నో మంచి పనులు చేసి పది కాలాల పాటు గుర్తుండిపోతారని... అటువంటి వారిలో తెలుగు భాషకు సేవ చేసిన విదేశీయుడు సిపి బ్రౌన్ ఒకరని వారు పేర్కొన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా విధులు నిర్వహించేందుకు సిపి బ్రౌన్ ఆంధ్ర ప్రాంతానికి విచ్చేసి కడపలో నివసించి తన జీతాన్ని, జీవితాన్ని తెలుగు భాషకు అంకితం చేసి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశాడని వారు కొనియాడారు. విదేశీయుడైన సిపి బ్రౌన్ తెలుగు భాష పట్ల మమకారాన్ని చూపి అనేక తాళపత్ర గ్రంథాలను సేకరించి భద్రపరిచి తెలుగు జాతికి అందించిన మహోన్నత వ్యక్తి అని వారు శ్లాఘించారు. నేడు తెలుగు భాష పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతున్న ప్రస్తుత తరుణంలో భాషీయులందరూ చైతన్యవంతులై భాషను కాపాడుకోకపోతే కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ప్రతి ఒక్కరూ అన్ని సందర్భాలలో భాషాభిమానాన్ని చూపి తెలుగును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడూరు గౌరీ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, దయాకర్, పావని, పుష్పలత, శ్రావణి, మౌనిక, మస్తానీ, సబీహ పాల్గొన్నారు.

పోటీతత్వమే క్రీడలకు ఔన్నత్యం

గెలుపోటములు సహజం..విద్యార్థుల్లో పోటీతత్వం తప్పనిసరి

రబ్బీ క్రీడలను ప్రారంభించిన పుత్తా

విశాలాంధ్ర-యర్రగుంట్ల : క్రీడారంగంలో గెలుపోటములు సహజమేనని ప్రతి క్రీడాకారులు విజయం కోసం పోరాడటం ద్వారా పోటీతత్వాన్ని అలవరచుకోవాలని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని పివిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో 68వ రాష్ట్రస్థాయి రబ్బీ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో కూడా రాణించేందుకు కృషిచేయాలన్నారు. విద్యతో పాటు క్రీడల ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. తద్వారా రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. ఇక్కడ జరుగుతున్న బాల, బాలికల అండర్-14 రబ్బీ పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి 350 మంది క్రీడాకారులు పాల్గొంటుండడం సంతోషకరమన్నారు. పుత్తా నరసింహారెడ్డి క్రీడాకారులతో కరచాలనం చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో యోగివేమన క్రీడల ప్రొఫెసర్ డా.కె.వి. రామసుబ్బారెడ్డి, స్థానిక పుత్తా కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, కమలాపురం ఎంఈవో సుభాషిణి, స్థానిక ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో పాటు భారతి సిమెంటు ప్రతినిధి భార్గవ్‌రెడ్డి, పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడి కేంద్రాలు స్థాపించండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: అంజుమన్ తరఖి ఉర్దూ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఎస్ కే ఆర్ ఎస్ కే ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీ య ఉర్దూ సెమినార్‌కు చైర్మన్ సత్తార్ ఫైజి అధ్యక్షత వహించగా కన్వీనర్‌గా సయ్యద్ హిదాయతుల్లాలు వ్యవహరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథు లుగా హాజరైన కడప ఎమ్మెల్యే ఆర్ మాధవి రెడ్డి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యు లు, ఆర్ శ్రీనివాసులు రెడ్డి, జాతీయ ఉర్దూ సెమినార్ చీఫ్ ప్యాటర్న్ అమీర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ భాషాకు కాపాడాల్సిన, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉర్దూ పాఠశాలల, కళాశాలల, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీకి, ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు వెంటనే స్థాపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ మైనారిటీల పక్షపాతి అని, మైనార్టీల అభివృద్ధికి, ఉర్దూ విద్యాసంస్థల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే ఉర్దూకు రెండో అధికార భాష హెూదా కల్పించారని, ఉర్దూ స్పెషల్ డిఎస్సి నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశారని రోషిని పథకం ద్వారా ఉర్దూ పాఠశాలలు ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా మెడకల్ కళాశాల కరస్పాండెంట్ జవ్వాద్ సాహెబ్, సంఘ సేవకులు సయ్యద్ సలాహుద్దిన్ ,సీనియర్ నాయకులు అష్రఫ్ అలీ ఖాన్, నజీర్ అహ్మద్, టిడిపి నాయకులు జిలానీ బాషా, అధ్యాపకులు డాక్టర్ సత్తార్ సాహిర్, డాక్టర్ అమీనుల్లా, డాక్టర్ అయ్యుబ్ హుసేన్, షఫీవుల్లా ఖాన్, డాక్టర్ సంజీరి, ఫైజుల్లా, డాక్టర్ ఖాజా పీర్, డాక్టర్ అబ్దుల్ వారిస్, సర్దార్, డాక్టర్ నఖివుల్లా ఖాన్, అంజుమన్ సభ్యులు సయ్యద్ రహమతుల్లా నజీర్ భాష,పర్వేజ్, యూనుస్, వాహిద్, మక్బూల్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష, రాష్ట్ర నేతలు బాలగంగి రెడ్డి, ఉర్దూ భాషాభిమానులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ వర్కర్స్ గత ఎనిమిది నెలలుగా వేతనాలు లేకుండా పనులు చేస్తున్న వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ను ఆప్కాస్ లో చేర్చి, వేతనాలు చెల్లించాలని శనివారం మూడవ రోజు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ మదనపల్లి జిల్లా ప్రభుత్వ సర్వజన భోదనా ఆసుపత్రిని జిల్లా ఇంఛార్జి మంత్రి బిసి జనార్దన రెడ్డి, మరియు రాం ప్రసాద్ రెడ్డి మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాషా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్స్ తో మాట్లాడి వారిని ఆప్కాస్ లో చేర్చి, వేతనాలు చెల్లించడానికి వారు కృషి చేయాలని కోరారు. 2024 మార్చి నుంచి విదులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది కి వేతనాలు చెల్లించకపోతే వారు కుటుంబాలు ఎలా గడుస్తాయని అధికారులు ఆలోచన చేయాలని, స్థానిక సబ్ - కలెక్టర్ ను, సంభందిత అధికారులను కలిసినా జీతాలు చెల్లించే విషయంలో పుట్టించు కోవడం లేదని ఆరోపించారు. ఒక వైపు మెడికల్ కళాశాల రద్దు అవుతోందని ఔట్ సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి ఏంటని వారు ఆవేదన చెందుతున్నారని, ఈ పరిస్థితుల్లో జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులు మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ సిబ్బందితో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది శ్రీనివాసులు , దాము,కొండప్ప,సూర్య, ప్రకాష్, సులోచన, రాజేశ్వరి, గంగాదేవి, గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్‌లో

ఇద్దరు విద్యార్థినీలు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-కడప : హాస్టల్ గేటు బయట అపస్మారక స్థితిలో పడిపోయిన విద్యార్థినిలు విషం తాగినట్లు సమాచారం.. గురువారం అర్ధరాత్రి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన ఆర్ చంద్ర హరిత, సి నందిని జమ్మలమడుగులో ఓ ప్రముఖ డిగ్రీ కాలేజీలో చదువుతున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చంద్ర హరితను కర్నూలు ఆసుపత్రికి నందిని ని కడప రిమ్స్ కు తరలించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రిమ్స్ ఉన్నతాధికారులను చరవాణి ద్వారా పేషంట్ కండిషన్ అడగ్గా రిమ్స్‌లో వైద్యం కోసం గురువారం నాడు చేరగా నందినికి అన్ని రకాల వైద్య పరీక్షలు మరియు స్కానింగ్ పరీక్షలు అందించామన్నారు. తర్వాత రిపోర్ట్స్ కూడా తీసుకోకుండా వెళ్లిపోయారన్నారు.

బాలికల వసతి గృహం నందు వైద్య శిబిరం

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: పట్టణంలోని ఏబీఎం స్కూల్ వద్ద గల ప్రభుత్వ వెనుకబడిన బాలికల వసతి గృహం నందు వైద్యాధికారి నల్లబల్లి హిమబిందు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సంధర్భంగా వైద్యాధికారిని బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహణ కల్పించారు. ముఖ్యంగా బాలికలు పీరియడ్స్ టైమ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్‌యూఓ సాధు శ్రీనివాసులు మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహణ కల్పించారు. అనంతరం 65మంది బాలికలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఇవ్వడం జరిగింది. అందరికి హెచ్‌బీ టెస్ట్ ఎల్‌టీ భూమిరెడ్డి రాణి చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు బి.ఉమాదేవి, సీజి మనోరాణి మరియు సిఓఎంవి సుబ్బారెడ్డి, ఏఎన్ఎం జ్యోతి, ఫార్మాసిస్ట్ దినేష్, ఆశ పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతులకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో రైతులు తీవ్రంగా గాయపడినట్లు తంబళ్లపల్లి ఎస్సై లోకేష్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పీలేరు మండలం నగిరిమడుగు చెందిన రైతులు వెంకటరమణ (58), రెడ్డప్ప(56) లు శనివారం ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లె మండలం, గోపిదిన్నెకు బయల్దేరారు.మార్గ మధ్యంలోని గోపిదిన్నె క్రాస్ వద్ద వేగంగా వచ్చిన ఆటో వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది మనోహర్, రఫీ క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో రెడ్డప్ప పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో, ప్రధమ చికిత్సల అనంతరం తిరుపతి రుయా కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య పరిక్షలతో తల్లి బిడ్డ సంక్షేమం సాధ్యం: డాక్టర్.చంద్రశేఖర్

విశాలాంధ్ర - పీలేరు : ప్రతి గర్భిణీకి పుట్టబోయే పండంటి బిడ్డకోసం ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి అని అందుకు ప్రతి నెల 9వ తేదీ తలుపుల పిహెచ్‌సిలో జరిగే పి.యం.యస్.యం.ఏ కార్యక్రమం గర్భిణికి చక్కటి అవకాశమని అది పుట్టబోయే శిశువుకి మహా భాగ్యమని డాక్టర్.చంద్రశేఖర్ గర్భిణిలకు హితవు పలికారు. శనివారం పి.హెచ్.సి.లో గర్భిణిస్త్రీలకు వ్యాధుల నిర్ధారణకు అవసరమగు రక్త,మూత్ర పరీక్షలు, మధుమేహం, ఆల్బిమిన్, అధిక రక్తపోటు మొదలగు పరీక్షలు నిర్వహించి, ఐరన్ ఫోలిక్ యాసిడ్, కాల్షియమ్,అల్బెం డజోల్ 400 యం.జి,మాత్రలతో పాటు సూచన సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వ్యాధుల నిపుణులతో నాలుగు గర్భిణీ పరీక్షలు రెండు టీడీ సూది మందులు, 180 ఐ.ఎఫ్.ఏ మాత్రలు, నెల నెలా వైద్యులు సూచించిన మూత్ర, రక్త పరీక్షలు, మరియు ఆసుపత్రిలో కాన్పు , ప్రతి గర్భిణీ పాటించాలని, అప్పుడే తల్లి, బిడ్డ,కు పూర్తి రక్షణ సాధ్యమని డాక్టర్.చంద్రశేఖర్ అన్నారు .పర్యవేక్షకులు కుసుమ సహకారంతో 22 మంది గర్భిణీలకు బ్రెడ్ ,పాలు, పండ్లు పంపినిచేశారు.కార్యక్రమంలో కొండయ్య హెచ్ ఇ,పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ,ఏ యన్‌యంలు, సి హెచ్‌ఓలు, ఆశ కార్యకర్తలు, గర్భిణిలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతుల ఆసక్తి

- కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, అరికెలు, ఊదలు సాగు

- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు - మార్కెట్‌లో మిల్లెట్స్‌కు మంచి డిమాండ్

విశాలాంధ్ర-రాయచోటి: మనుషుల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. చిరుధాన్యాల విలువేంటో సమాజానికి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. కొర్రాల పాయసం, రాగి జావ లాంటి పేర్లు జనాల నాలుకల మీద తిరుగుతున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటకు సార్ధకత చేకూరుతోంది. గటకే తిన్నామో..! గంజే తాగామో..! అని మాట వరుసకు అంటుంటాం. పేదతిండి అని చెప్పడానికి వాడే ఉపమానం అది. నిజానికది గరీబు తిండి కాదు. నిఖార్సయిన తిండి. నిండైన తిండి. గంభీరమైన తిండి. శ్రీమంతుల తిండి. ఇంకా చెప్పాలంటే- చిరుధాన్యాలకు మించిన పౌష్టికాహారం- ఈ భూమండలం మీదనే లేదు. అందుకే ఒకప్పటి పచ్చజొన్నల గట్క మళ్లీ రారమ్మని పిలుస్తోంది. ఆనాటి రాగిజావ తిరిగి కళ్లముందు కదలాడుతోంది. కనుమరుగైన సామపాశం మళ్లీ సాహెూ అంటోంది. మచ్చుకైనా కనిపించని సజ్జ మలీదలు మిర్రిమిర్రి చూస్తున్నాయి. ఈ తరానికే తెలియని నూనె పోలెలు నున్నగా కవ్విస్తున్నాయి. ప్రాభవం కోల్పోయిన చిరుధాన్యాలు చిరునవ్వులు రువ్వుతున్నాయి. సన్నబియ్యం, బాసుమతి రైస్ తినడమే స్టేటస్ అనుకునే రోజులు పోతున్నాయి. దంపుడు బియ్యం ఎంత రేటున్నా సరే కొంటున్నారు. రాగి అంబలి తాగడానికి క్యూ కడుతున్నారు. ఎండాకాలం సామబియ్యం తింటే చలువ అని జనానికి అర్ధమైంది. చలికాలం కొర్రబువ్వ తినాలని ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది. చిరుధాన్యాల సాగుతో రైతు ఇంట సిరులు కురువనున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి అధిక లాభాలను ఆర్జించవచ్చు. అన్నమయ్య జిల్లాలోని నేలలు కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, అరికెలు, ఊదల పంటల సాగుకు అనుకూలమని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అతి తక్కువ వర్షపాతం నమోదైనా పంట చేతికొస్తుందని పేర్కొంటున్నారు. జిల్లాలో చిరుధాన్యాల సాగుపై అధిక శాతం రైతులు ఆసక్తిని చూపుతున్నారు.

ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెడితే 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. కిలో రూ.60 నుంచి రూ.70 వరకు ధర పలుకుతుండగా, క్వింటాలుకు రూ. 6వేల నుంచి రూ. 7వేల వరకు వస్తుంది. అంటే ఎకరాకు దాదాపు రూ.70 వేలకుపైగా ఆదాయం సమకూరనున్నది. రైతుల్లో అవగాహన పెంచి ఈ అన్నమయ్య జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచేలా వ్యవసాయ శాఖ కృషి చేస్తున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో మారిన ఆహారపు అలవాట్ల వల్ల పెరుగుతున్న ఊబకాయం, అనారోగ్య సమస్యలతో తిరిగి తృణధాన్యాలకు ప్రాధాన్యం పెరిగింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సైతం తృణధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే దిశగా రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇతర పంటల కన్నా ఖర్చు తక్కువ ఆశించిన స్థాయిలో దిగుబడులు కూడా రావడంతో వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. చిరుధాన్యాల ప్రాముఖ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్నది. పూర్తి స్థాయిలో ప్రజల్లో అవగాహన వస్తే వీటి వినియోగం కూడా పెరుగుతుంది. తేలికపాటి నేలల్లో అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో కొర్ర పంటను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లా పరిధిలో తృణధాన్యాల సాగు రెండు సంవత్సరాలుగా పెరుగుతున్నది. జిల్లాలో 1,520 ఎకరాల్లో జొన్న, రాగులు, కొర్రలు, సజ్జలు సాగు జరుగుతుంది. 7 రకాల తృణధాన్యాలు ఉండగా వాటిలో జొన్న, రాగులు, కొర్రలు, అక్కడక్కడ సామలు పండిస్తున్నారు. జిల్లాలోని 11 మండలాల్లో ఈ రబీ నందు 320 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేశారు. జిల్లాలో అదనంగా తృణధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడానికి అధికారులు ప్రణాళికాబద్దంగా ముందుకు సాగుతున్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర-రామసముద్రం: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయల రాష్ట్ర జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడలిలో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నాగినేని గోవిందు అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు తలారి శ్రీనివాసులు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగార్జున మాట్లాడుతూ పాలకులు వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని మోసగిస్తూ తర్వాత వారిని మరచిపోతున్నారని, ఈ మోసపోయిన వాల్మీకి జాతి కోసం వాల్మీకి బోయలందరూ ఏకమై వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు ఉద్యమించాలని, పిలుపునిచ్చారు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపుదించాలని పార్టీలకు, కుల సంఘాలకు అతీతంగా వాల్మీకి బోయలు ఏకతాటిపై నడిచి ఈనెల 17వ తేదీ ఆదివారం మదనపల్లెలోని దేశాయ్ ఫంక్షన్ హాల్ లో జరిగేవాల్మీకి బోయల కుల సమావేశానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని, దేశాయ్ ఫంక్షన్ హాల్ లో జరిగే ఈ సమావేశానికి వచ్చి సత్తా ఢిల్లీ వరకు చేరేలా సాటి చెప్పుదామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు కొత్తూరు చిన్నరెడ్డప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నం వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మనపల్లి లక్ష్మన్న, అధికార ప్రతినిధి కోటికి శేకర, కార్యదర్శి మేకల లక్ష్మీనారాయణ ,రామసముద్రం వాల్మీకి నాయకులు వాల్మీకి నాయకులు కదిరప్ప, తలారి సుబ్రహ్మణ్యం, బోయ వీధి రమణ, శ్రీనివాసులు, విజయ్ కుమార్ ,పవన్ కుమార్ ,కృష్ణమూర్తి, కొత్తూరు చంద్ర ,గంగప్ప ,సీసీ వెంకటరమణ, వెంకటరమణ మరియు వాల్మీకి బోయ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో కమీషనర్ పర్యటన

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 33వ వార్డులో మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితా దేవితో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా స్థానిక ఎస్.వి.ఎస్ హైస్కూల్ వద్ద నుండి మక్కా మసీదు వరకు ఎన్ఫోచ్మెంట్ రో డ్డు నిర్మాణానికి అంచనా తయారు చేయాలని సంబంధించిన ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా మక్కా మసీదు వద్ద గ్రిల్స్ మరమ్మత్తులు చేయాలని సంబంధించిన ఇంజనీరింగ్ విభాగం వారికి ఆదేశించారు. మున్సిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూల్ మక్కా మసీదు సంబంధించి మైనర్స్ రిపేర్స్ కొరకు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక వినాయక నగర్ మోటు నుండి దేవాంగపేట కళ్యాణ మండపం ఎదురుగా వరకు సీసీ రోడ్డు మరియు కాలువలకు సంబంధించి అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.

ఎయిడ్స్ పై అవగాహనా కార్యక్రమం

విశాలాంధ్ర - పీలేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలు మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ సంస్థ ఈ రోజు కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి రోడ్ గురుకుల బాలికల పాఠశాల పీలేరు నందు మీకు తెలుసా హెచ్ఐవి ఎయిడ్స్ పైన అవగాహనా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఐవి/ఎయిడ్స్ ఎలా వస్తుంది ఎలా రాదు హెచ్ఐవి స్థితిని ప్రారంభం లోనే తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోకపోతే ఎయిడ్స్ దశకు చేరే అవకాశం ఉంటుందని హెచ్ఐవి వ్యాధిగ్రాస్తుల పట్ల వివక్ష చూపారాదని హెచ్ఐవి/ఎయిడ్స్ సుఖవ్యాధులని నియంత్రించడంలో కాండోమ్ ముఖ్య పాత్ర వహిస్తోందని హెచ్ఐవి/ఎయిడ్స్ ప్రెవేన్షన్ యాక్ట్ 2017 మందులు అప్సక్స్ యాప్ మరియు టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి పిల్లల కు అవగాహనా కల్పించడం జరిగింది ఈ కార్యక్రమం లో కోర్ స్వచ్ఛంద సంస్థ కే. రాజమ్మ షర్మిల కే. సల్మా మరియు హాస్టల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

ఇద్దరిపై కేసు నమోదు

విశాలాంధ్ర-రామసముద్రం : మండలంలోని కురిజల గ్రామంలో వెలసిన చెన్నారాయ స్వామి ఆలయ మాన్యం భూముల వేలంపాట వద్ద దేవాదాయ శాఖ ఈవో రమణారెడ్డి విలేకరి జస్వంతులను అడ్డుకుని జస్వంత్ ఫోను లాక్కొని దౌర్జన్యం చేసినందుకు కేసు నమోదు చేసినట్లు రామసముద్రం ఎస్సై వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు కురిజలగ్రామానికి చెందిన జంగారెడ్డి తమ్ముడు గోపాల్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించిన ఎస్ఐ తెలిపారు

వైసీపీ రాక్షస పాలనలో నష్టపోయిన వారెందరో

తెదేపా పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు

విశాలాంధ్ర-సుండుపల్లె: రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనలో నష్టపోయిన వారెందరో ఉన్నారని 2019-24 మధ్య కాలంలో ఆ ప్రభుత్వ అరాచకాలు తట్టుకోలేక ప్రజలు భూములు కోల్పోయిన వాళ్లు,భూములకు కప్పం కట్టేవాళ్ళు, రేషన్ కార్డులు తొలగించడం,అక్రమ కేసులు పెట్టడం,ఆర్థికంగా సామాజికంగా అన్ని విధాల నష్టపోయిన వాళ్లు మనందరిలోనూ ఉన్నారని, తెలుగుదేశం పార్టీ జెండా పట్టుకున్న అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేశారని,ఎన్ని ఇబ్బందులు పెట్టిన కష్ట నష్టాలకు ఎదురొడ్డి,మొట్టమొదటిగా తెలుగుదేశం పార్టీ జెండాను ఈ మండలంలో ఎగురవేసామని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు, శనివారం తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షుడు కళ్లే రెడ్డప్ప ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై నమ్మకంతో రాష్ట్ర ప్రజలు దేశంలోనే అత్యధిక మెజార్టీని అందించారని ప్రజలకు జవాబుదారీతనంగా పార్టీ పనిచేస్తుందని అధికారులు కూడా అలాగే చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేయాలని అధికారులు గుర్తుపెట్టుకుని ప్రజలకు సేవలభించాలని ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా ప్రవర్తిస్తే ప్రజలే ఇంటికి పంపుతారన్నారు, గత ప్రభుత్వంలో వేల కోట్లు అప్పు తెచ్చినా జీతాలు ఒకటవ తేదీన ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులలో పాలనలో ఒకటో తారీఖున జీతాలు ప్రభుత్వం చెల్లిస్తుందని గుర్తు చేశారు, రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత నామినేటెడ్ జరుగుతోందని అనంతరం అన్ని మండలాల సమాచారం అధినాయకుల దగ్గర ఉందని అన్ని పరిస్థితులు ఒకటి రెండు నెలల్లో చక్కదిద్దుకుంటాయని మన పార్టీ తరపున బాధ్యత వహించే నాయకుడు మీద నుంచే వస్తాడని నేను కూడా ఈ మండల వాసినానని కార్యకర్తలకు నాయకులకు భరోసాని ఇచ్చారు.

ఘనంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సభ్యత్వం గతంలో వారికి ఇష్టం వచ్చిన పేర్లు రాసుకునే వారిని ఇప్పుడు అలా కాకుండా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కార్యకర్తలను దృష్టిలో ఉంచుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ రెండు సంవత్సరాల కాల పరిమితితో సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ఐదు లక్షల ధీమాతోపాటు 10 వేలు మట్టి ఖర్చులకు అందిస్తున్నారని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు, అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కళ్ళె రెడ్డప్ప,మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు,మాజీ ఎంపీటీసీ మోహన్ బాబు నాయుడు,మండల బీసీ సెల్ అధ్యక్షులు బెల్లాల రమణయ్య,రాయవరం సర్పంచ్ షరీఫ్,రఫీ, సీనియర్ నాయకులు శివరామ్ నాయుడు,రాజగోపాల్ నాయుడు, ఎస్సీ నాయకులు చంద్రమౌళి,మండల అధికార ప్రతినిధి కిరణ్ చౌదరి,ఐ.టీడీపీ అధ్యక్షులు ఎల్వి రమణ,తెలుగు యువత అధ్యక్షులు మాలేపాటి సురేష్ నాయుడు,బూత్ ఇంచార్జ్ ఇస్మాయిల్,టిడిపి నాయకులు రాజా నాయుడు,మైనారిటీ నాయకులు మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు కత్తి అమర్నాథ్ రెడ్డి,మస్తాన్ శెట్టి,యూనిట్ ఇన్చార్జ్ ఆంజనేయులు,శివా రాయల్,నంద్యాల శివప్రసాద్,మంగిరి సురేష్, పురుషోత్తం రాజు పాల్గొన్నారు.

మోయడానికి మేమున్నాం

మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్

విశాలాంధ్ర -ప్రొద్దు టూరు: పట్టణంలోని స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్‌లో చాగంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి(35) అనే వ్యక్తి అనారోగ్యం చేత చికిత్స పొందుతూ మరణించగా అంత్యక్రి యలు చేయడానికి బంధు వులు రాకపోవడంతో అంత్యక్రియలు చేయడానికి ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఫౌండర్ మోరె లక్ష్మణ్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి శనివారం ఉదయం 12:00గంటలకు హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మెన్ మోరె లక్ష్మణ్ రావు, ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా, దస్తగిరి, కమాల్ బాష, కృపా అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్ బాబు, సురేష్ మరియు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. మా శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయదలచిన దాతలు ఉంటే 82972 53484, 91822 44150 అనే నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

మంద కృష్ణ మాదిగ పర్యటనను

విజయవంతం చేయండి

ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ

విశాలాంధ్ర - పీలేరు :-మహా జననేత మంద కృష్ణ మాది రాయలసీమ జిల్లాల పర్యటనలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లి లో జరిగే మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ద రామకృష్ణ మాదిగ తెలియజేశారు పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ వాల్మీకిపురం మండల అధ్యక్షులు గంటా బాలకృష్ణ మాదిగ, ఎం.ఎస్.పి సీలేరు నియోజకవర్గ కో ఇన్చార్జ్ ముల్లంగి రెడ్డప్ప, ఎం ఈ ఎఫ్ నాయకులు సంగీతం రవీశ్వర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథి గా ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ,విశిష్ఠ అతిథి గా ఎం.ఆర్.పి.ఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రవీంద్ర మాదిగ, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్న మాదిగ లు హాజరై సంయుక్తంగా మాట్లాడుతూ అభినవ అంబేద్కర్, మహాజన నేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ గత 30సంవత్సరాలుగా మాదిగ, మాదిగ ఉపకులాల ఉజ్వల భవిష్యత్ కై, మరియు సమాజం లోని పేదవర్గాల సంక్షేమనికై అనేక రకాల మిలిటెంట్ ఉద్యమాలు చేసి జాతి చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనలో గుడిసెల్లో నిద్రిస్తున్న ప్రతి మాదిగ, మాదిగ ఉపకులాల బిడ్డలను తట్టి లేపి ఢిల్లీ లోని భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్ తలుపు తట్టి సామాజిక న్యాయం బలపడేవిదంగా ఎస్సీ వర్గీకరణ చట్టభద్దత రాష్ట్రాలు చేసుకొనే హక్కు ఉందని స్పష్టం చేసిన తరువాత మొట్ట మొదట సారిగా నవంబర్ 14 న ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లి కు మహాజన నేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ విచేయుచున్నారు కనుక వాల్మీకిపురం మండలం లోని ప్రతీ మాదిగ పల్లె, ప్రతీ ఇంటి నుండి ఇళ్లకు తాలాలు వేసుకొని మన అధినేత కు ఘన స్వాగతం పలకడానికి ప్రతీ ఒక్కరూ తరలి రావాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మహాజన సోషలిస్టు పార్టీ పీలేరు నియోజకవర్గం ఇంచార్జ్ గండికోట వెంకటేష్, ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి నాయకులు మదన మాదిగ, నరసింహులు మాదిగ, బాబు మాదిగ, నరసింహులు, జస్వంత్ మాదిగ, వేణు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్ భాషకు రుణపడి ఉంటాం

విశాలాంధ్ర-రామసముద్రం: మదనపల్లె ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాష దేవాదాయశాఖ అధికారులకు రుణపడి ఉంటామని కురిజల గ్రామస్తులు. శనివారం తెలిపారు గుంతల పేట లోని టిడిపి మండల పార్టీఅధ్యక్షుడు గౌని వారి విజయ్ కుమార్ గౌడ్ నివాసం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కురిజల గ్రామస్తులు, మాజీ జెడ్పిటిసి ముని వెంకటస్వామి, శంకర నాయుడు, నాగరాజ మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా అన్యాక్రాంతమైన చెన్నరాయ స్వామి ఆలయం భూమిని దేవాలయ శాఖ స్వాధీనం చేసుకునేందుకు కృషిచేసిన మదనపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే షాజహాన్ భాష, మండల టిడిపి అధ్యక్షుడు గౌని వారి విజయ్ కుమార్ గౌడ్, మాజీ జెడ్పిటిసి శివశంకర్ ,సీనియర్ నాయకులు రాజేష్ స్వామి, బోయ వీధి రమణ, పోలీస్ శాఖ అధికారులు, రెవిన్యూ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు శిథిలావస్థకు చేరిన చెన్నరాజస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి కూడా అందరు సహకారంతో పూర్తి చేయాలని తెలుపారు. ఈ సమావేశంలో కురిజల గ్రామస్తులు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు నేత లింగమూర్తి మృతికి సిపిఐ ఘననివాళి

విశాలాంధ్ర-కడప రూరల్ : స్థానిక సాయి నగర్‌లో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కే లింగమూర్తి మృతదేహానికి సిపిఐ నాయకులు శనివారం నివాళు లర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ పులివెందుల తాలూకా, లింగాల గ్రామానికి చెందిన కే లింగమూర్తి విద్యార్థి దశలో కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడై యువజన సంఘం జిల్లా నాయకుడిగా, సిపిఐ కడప పట్టణ కార్యదర్శిగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సిపిఐ తొలి తరం నాయకులైన గజ్జల మల్లారెడ్డి, కొన్న తోట వెంకటరెడ్డి, కె.వి నాగిరెడ్డి, ఎద్దుల ఈశ్వర్ రెడ్డి, శివరామిరెడ్డి, వెంకట్రామిరెడ్డిలతో కలిసి అనేక ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారన్నారు. సోవియట్ రష్యా పర్యటన, ఐప్సో, ఇస్కఫ్ రంగాలను ఏర్పాటు చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు.నీటిపారుదల ప్రాజెక్టుల కోసం సమరశీల పోరాటాలు నిర్వహించారన్నారు. లింగమూర్తి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు.సిపిఐ సీనియర్ నాయకులు పి.చెన్నకేశవరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామయ్య, ఎన్.వెంకట శివ, ఎం.వి సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, మద్దిలేటి, పల్లవోలు రమణ, రమేష్, ఓబులేసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటి పట్టణంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం కడప జిల్లా సివిల్ జడ్జి ప్రత్యుష స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కార్యనిర్వహణ అధికారి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

అవినాష్ రెడ్డి పిఏ రాఘవరెడ్డి అరెస్టుకు పోలీసుల యత్నం

విశాలాంధ్ర-పులివెందుల: కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాఘువరెడ్డి అరెస్టు చేయడానికి శుక్రవారం పోలీసులు యత్నించారు. రాత్రంతా ఆయన ఇంటి వద్ద పోలీసులు పడి కాపులు కాసినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న రాఘువ రెడ్డి ఇంటికి రాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు సమాచారం. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వైయస్ అవినాష్ రెడ్డి ముఖ్య అనుచరుడు వర రవీంద్రారెడ్డిని ఇదివరకే పోలీసుల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రతో రాఘువ చాటింగ్ చేసినట్టు సమాచారంతో పోలీసులు అరెస్ట్ చేయడానికి వచ్చినట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం రాఘువ ఇంటి దగ్గరకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. రాఘువ రెడ్డిని అరెస్ట్ చేస్తున్నట్టు తండ్రికి సమాచారం ఇచ్చినట్టు తెలుస్తుంది.వైసీపీ లీగల్ అడ్వైజర్ ఓబుల్ రెడ్డి రాఘువ వస్తానే సమాచారమిస్తామని పోలీసులకు తెలపడంతో తిరిగి వెనుదిరిగినట్లు తెలిసింది.

సిఎం కృషిని సఫలం చేద్దాం :ఆనంద్ యాదవ్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర అబివృద్ధి,ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా భావించి అహర్నిశలు శ్రమిస్తున్న టీడీపీ అధినేత,సీఎం నారా చంద్రబాబు నాయుడు కృషిని అంచనాలకు మించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుతో సఫలం చేద్దామని కూటమీ సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసి బత్తిన ఆనంద్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్ రాయులు అద్వర్యంలో శనివారం కృష్ణానగర్‌లో నరసింహులునాయుడు, పూల వ్యాపారం చేసే తదితరులకు చెందిన ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశంపార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ ఆనంద్ యాదవ్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. సభ్యత్వ నమోదుతోనే పార్టీ పటిష్టిత సాధ్యమన్నారు. బత్యాల చంగల్ రాయులు అద్వర్యంలో సభ్యత్వ నమోదులో రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని స్టేట్ లో మొదటి స్థానంలో నిలబెట్టడమే తమ ముందు ఉన్న లక్ష్యం అన్నారు.కేవలం 100 రూపాయల సభ్యత్వం తీసుకున్న టిడిపి కార్యకర్తలకు 5 లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా, వారి కుటుంబ సభ్యులకు విద్య వైద్యం ఉపాధి కోసం సాయం అందించనుందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జి మణిదీప్తి కుమార్, జి.నాగమణి మురగ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సికేదిన్నె ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డా.నాగరాజు

విశాలాంధ్ర-కడప : వైద్యఆరోగ్య శాఖ కార్యక్రమాల పర్య వేక్షణలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. నాగరాజు చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ రికార్డులను తనికిచేసి అక్కడ అందచేయబడుతున్న సేవలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అక్కడ రక్తపరీక్షలు విభాగాన్ని ఫార్మసీ విభాగాన్ని సందర్శించి సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మితమవుతున్న కేంద్రీకృత రక్తపరీక్షల భవనాన్ని పరిశీలించారు. కార్య క్రమాలను విజయవంతం చేస్తున్న స్థానిక వైద్యులు డాక్టర్ రాఘు వేంద్ర, డాక్టర్ సునీతలను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఎంఎస్ఎంఎ డాక్టర్ హర్షిత, సమాజ ఆరోగ్య అధికారి సుకుమారన్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడ్డ ఆమూల్ మహిళా డెయిరీలు

విశాలాంధ్ర-పెద్దమండ్యెం : మండలంలో గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఆముల్ పాలు కేంద్రాలకోసం ప్రభుత్వం ఎంతో కష్టపడి నిరంతర విద్యుత్,నీరు రూములు ఏర్పాటు చేశారు. పాల కేంద్రాల ద్వారా రైతులకు అధిక రేటు వస్తుందని గ్రామాలలో లక్షలు ఖర్చు చేసి సక్రమంగా పాలసేకరణ జరుగుతుంది అనికేంద్రాలను ఏర్పాటు చేసి పాలు సేకరించారు. సేకరించిన పాలకు అధిక రేటు చెల్లించి ప్రజలకు మంచి ఆదాయం వచ్చే విధంగా చేశారు. ప్రజలు సంతోషంగా ఉన్నారు.అనే సమయానికి కొద్దిరోజులకు కేంద్రాలను మూసి వేశారు ఏమైందో తెలియక ప్రజలు నాణ్య మైనా రేటు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసి సక్రమంగా పాల సేకరణ చేయడంలో గత ప్రభుత్వం విఫలమైనదని ప్రజలు అంటున్నారు ఇకనైనా ప్రజలకు ఇబ్బంది కల్గకుండ చూడాల్సివుంది. పాలకు అధిక రేటు చూసి మూసిన కేంద్రాలను ప్రారంభించి ప్రజలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుకొంటున్నారు.

నామినేటెడ్ పదవుల్లో రైల్వే కోడూరుకు సముచిత స్థానంపై హర్షం

విశాలాంధ్ర-రాజంపేట: రైల్వే కోడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన కేకే చౌదరి, రైల్వే కోడూరు ఇన్చార్జి ముక్క రూపనంద రెడ్డికి నామినేటెడ్ రెండవ జాబితాలో రైల్వే కోడూరు నియోజకవర్గానికి సముచిత స్థానం కల్పించినందుకు ఎన్నారై టిడిపి నాయకులు ఓలేటి రెడ్డయ్య చౌదరి, ఎన్ఆర్ఐ టీడీపీ జనరల్ సెక్రెటరీ మళ్లీ మారోతు సీఎం నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో రైల్వే కోడూరు నియోజకవర్గంలో కూటమి తరపున బలపరిచిన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించుకోవడంలో ముక్క రూపానంద రెడ్డి, కేకే చౌదరి ప్రముఖ పాత్ర వహించారన్నారు. అధికారంలో రాగానే పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం ఇచ్చారన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గం నుండి రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి చైర్మన్‌గా నియమితులైన కేకే చౌదరికి, అన్నమయ్య జిల్లా అర్బన్ రూరల్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఎన్నికైన ముక్కా రూపానంద రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

చెన్నప్పగారి గడ్డ స్తోస్త్రీయ భూమి పేదలకు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-మదనపల్లె:ములకలచెరువు మండలం గుడుపల్లి పంచాయతీ చెరువు కింద పల్లి సమీపంలో ఉన్నటువంటి చిన్నప్ప గారి గడ్డ సో స్త్రీయ భూములు 220 ఎకరాలు భూములను దళిత గిరిజన వెనకబడిన వర్గాలకు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపు కృష్ణప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు అన్నారు. శనివారం ములకలచెరువు మండల సమితి ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా వివిధ రూపాలలో గత 20 సంవత్సరాలుగా భూమికోసం భుక్తి కోసం పేదల జీవన పోరాటం కోసం అనేక ఆందోళనలు పోరాటాలు చేశామన్నారు. స్థానిక తంబాళ్లపల్లి టీడీపీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డిని గత ప్రభుత్వ భూ అక్రమాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా తంబాలపల్లి నియోజకవర్గం మలకలచెరువు మండలం గుడుపల్లి పంచాయతీ చెరువుకిందపల్లి సమీపంలో ఉన్న చిన్నప్ప గారి గడ్డ స్తోస్త్రీయ భూములు 220 ఎకరాలు ప్రభుత్వ భూమి వైసీపీ అధికారంలో ఉండగా మాజీ శాసనసభ్యులు అప్పటి మండల తాసిల్దార్ శ్రీనివాసులు భూ అక్రమాలకు పాల్పడి పక్క జిల్లాకు చెందిన అనంతపురం జిల్లా వాసులు పడాభూషములు రాజకీయ నాయకులకు ప్రభుత్వం అప్పనంగా అప్పజెప్పి కోట్ల రూపాయలు చేతులు మారాయని తెలిపారు. వాటిని వెంటనే రద్దు చేసి గతంలో సిఎల్ఆర్ కోర్టులో 104 ఎకరాలు ప్రభుత్వ పరం అయినదని సిఎల్ఆర్ కోర్టు ప్రభుత్వానికి చెందేటట్టు ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని అన్నారు. దొంగ చాటుగా జరిగిన దొంగ పాసుబుక్కులు దొంగ ఆన్లైన్‌ను రద్దుచేసి పేదలకు పంపిణి చేయాలని జయచంద్రారెడ్డికి వివరించారు. వారు వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి వాటి పూర్వపరాలు పరిశీలించి రద్దుచేసి స్థానికులకు భూములు దక్కే విధంగా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తంబళ్లపల్లి నియోజకవర్గ కార్యదర్శి ఎస్ మనోహర్ రెడ్డి, సిపిఐ ములకలచెరువు మండల కార్యదర్శి కే.అంజనప్ప, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు మంత్రాలు రమణ, వేమన్న, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మదనపల్లి డివిజన్ కన్వీనర్ చంద్రశేఖర్, వెంకటస్వామి, ములకలచెరువు మండల అధ్యక్ష కార్యదర్శులు వేమ నారాయణ, చంద్రశేఖర్, నరసింహులు, గంగులమ్మ, రత్నమ్మ, రమణమ్మ ,ముత్తన్న ,లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో కడప, అన్నమయ్య జిల్లాల్లో దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
కడపజిల్లా: కడప సిటి, కమలాపురం, సి.కె. దిన్నె, వి.ఎన్.పల్లి, చక్రాయపేట, పెద్దముడియం, రాజుపాలెం, చాపాడు, పెండ్లిమర్రి, బి.కోడూరు, పులివెందుల రూరల్, లింగాల, జమ్మల మడుగు రూరల్, దువ్వూరు, సింహాద్రిపురం.
అన్నమయ్యజిల్లా: రాయచోటి రూరల్, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలు, రైల్వేకోడూరు రూరల్, చిన్నమండ్యం, కలకడ, కె.వి.పల్లి, కలికిరి, పిటియం, వాల్మీకిపురం, తంబళ్లపల్లి, కురబలకోట, మొలకలచెరువు, మదనపల్లి రూరల్, నిమ్మనపల్లి.
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 9985589444